# "పిచ్చిది!"

శ్రీమతి బులుసు ప్రకాశమ్మగారు

'సంఘద్వేషానికీ, లోకాచారానికీ, బలి ఐపోయి, కాలపరిస్థితుల వల్ల జీవచ్ఛవాలుగానూ, మృత జీవులుగానూ చేయబడ్డ ఈ లాంటి పిచ్చివాళ్లు భారతదేశంనిండా ఎందరున్నారో కదా!'

'పిచ్చిది! పిచ్చిది! అరేయి; పిచ్చిదిరా! రాండిరా!'

మధ్యాన్నం మూడుగంటలవుతుంది. కాఫీ 'అయిటం' పూర్తిచేస్తున్నాము. కమల చిన్నకొడుకు శేషు, పంట్లాం జేబులలోను, చొక్కాజేబులో కొన్ని, ఇంకా గుప్పెళ్లలో పట్టుకోగలిగినన్ని వేరుశెనక్కాయలు తీసుకుని తల్లివేపు దొంగచూపులు చూస్తూ జారుతున్నాడు. మళ్లీ పోసుకుపోతున్నావు కాదూ? అన్నట్లు తనవేపుచూశిన తల్లిచూపుకు జవాబుగా 'పిచ్చమ్మకే' అని దీనంగా ప్రాధేయతగా తల్లిని లాక్కోవద్దన్నట్లుగా అని వీధులోకి ఉడాయించాడు. కమల నవ్వి ఊరుకుంది. అన్ని వేరుశెనక్కాయలు పిల్లవాడు పోసుకుపోతూంటే ఊరుకుంటుందేమిటి! కమల! జబ్బుచేయవూ?! నాకేమీ అర్థంకావడంలేదు. వీధులో ఇంకా గోలగానే ఉంది. 'పిచ్చిది! పిచ్చిది!'

'అబ్బా, ఎంత గోలగావుంది వీధి! ఎవరాపిచ్చిది?' అన్నాను కాఫీ తాగుతూనే. 'చూద్దుగాని రా' అంది కమల.

ఇంగ్లీషు యూనిఫారములో పెద్ద బ్యాండుమేళం ఒకటి, దేశీయ యూనిఫారంలో (చిరతపులి మచ్చల డ్రస్సులో) పది డప్పులు, కొబ్బరాకులు, రంగు కాగితాలు, అరటాకులతో అలంకరించిన బళ్లు రెండు, బ్రహ్మాండంగా వెడుతోంది, సినీమా ఎడ్వర్టైజుమెంటు. జనం గుమ్మాలలోంచి, అరుగులమీదనుంచి ఎంతో ఉత్సాహంగా చూస్తున్నారు. స్త్రీలు సగం అల్లిన జడ ఓచేతిలో ఉండగానే రెండోచేత్తో పిల్లల చేతిలో పేపరు అందుకుని చదివేస్తున్నారు అడావిడిగా. ప్లీడరుగారొకరు బుజాన్ని వేల్లాడే సగంవిప్పిన కోటు, తలపాగాతో అరుగుమీద నుంచుని, నౌఖరుచేతులో పేపరు అందుకోడంలో పాగా జారి సైడు కాలవలో పడిపోయింది. పెద్ద పిల్లలగుంపు వకటి బండ్లవెనకాల విడవకుండా ఊరేగుతోంది. ఒక్కొక్కడి చేతులో రెండు మూడు, ఇంకా ఎక్కువే ఉన్నాయి పేపర్లు. అయినప్పటికీ వారు బండిని విడవడంలేదు. నాకో పేపరివ్వరూ? నాకండి, నాకండి, అంటూనే ఉన్నారు.

పిల్లల గుంపుతోకూడా ఊరేగుతోంది ఒక పిచ్చిది. పుచ్చుగునే పేపర్లు పుచ్చుగుంటూనే ఉంది. పంచిపెట్టేవి పంచిపెడుతోంది. కొందరిని ఎత్తుగుంటోంది. మళ్లీ ఏం పుడుతుందో నిమిషానికే దింపేస్తుంది. మళ్లీ ఇంకోవాణ్ణి ఎత్తుకుంటుంది. అందరితోనూ మాట్లాడుతోంది. పరిగెడుతోంది. నవ్వుతోంది. పిల్లలుకూడా మామూలు పిచ్చివాళ్లని చూశినట్లు ఈవిడని చూడడంలేదు. పేపర్లు ఇచ్చేవాడొకడు. తను దాచితెచ్చినవి 'తిను' అని పెట్టేవాడొకడు. కొంగుపట్టుగు నడిచేవాడొకడు. చంకకెగిరేవాడొకడుగా ఉన్నారు.

‘అయ్యో ఇదేమిటి!! కూరెళ్లారి చిట్టెమ్మ్రా! చిట్టెమ్మ చచ్చిపోలేదు! బతికేఉంది’ అంటూనే చిట్టెమ్మా? ఓ చిట్టెమ్మా? అని కేకవేశాను నేను.

‘ఇదేమి లేవు! లక్ష్మి? పిచ్చిదాన్ని చూడగానే నీక్కూడా పిచ్చెక్కిందా? ఏమిటి? ఏమిటా కేకలు, వీధులో? రా, లోపలికి’ అంది కమల.

చిట్టెమ్మ తిరిగేనా చూడలేదు. పిల్లవాణ్ణొకణ్ణి చంకనెత్తుకుని ముఖంమీద ముఖంపెట్టి కళ్లల్లో చూస్తూ ఏదో మాట్లాడుతోంది. ఎల్లాంటిమనిషి ఎల్లాగైపోయింది! బతికేఉంది! మహా చూశి ఏడిశినవాళ్లల్లే ఏట్లోపడి చచ్చిపోయిందన్నారు! అంతే, శ్రద్ధగా వెతికిన దిక్కేరీ? బారెడు జుట్టు! దుమ్ముతో నిండి ఎల్లాగైపోయిందో!! బట్టరంగు, జుట్టురంగు, వంటిరంగు ఒక్కలాగుంది. ఏరోజు కేగతో గదా! అయినా అన్నికష్టాలు పడ్డాక ఇంతకంటె - అంటున్నాను నేను. నువ్వెక్కడేనా చూశావా ఏమిటి, ఈ మనిషిని? అంతగా బాధపడుతున్నావు? అంది కమల.

‘ఎరగడమేమిటి? అయిదారేళ్లనాటి సంగతి ఇది. నేను ఆ రోజులలో పదమూడు పధ్నాలుగు ఏళ్ల దానిని. చిట్టెమ్మ ఈవిడపేరు. వీళ్లు మాయింటికి మూడిళ్లవతల కాపురం ఉండేవారు. ఈవిడ భర్త ఏదో ఎలిమెంటరీ స్కూలులో మాష్టరు. ఇంకా ట్రైనింగ్ కాలేదని చెప్పుగునేవారు. రెండేళ్ల పిల్లవాడుకూడా ఒకడు ఉండేవాడు ఈవిడకి. వీళ్లుండే వాటాకి నెలకు మూడురూపాయలద్దె. సామాన్యంగా మూడురూపాయల వాటాలు ఎల్లా ఉంటాయో అల్లాగే ఉండేది, వీరి వాటా. మట్టి, చీకటి, ఇరుకు, నేలబారు అవడం చేత తేమ. కాలం ఏదోవిధంగా నెట్టుకుపోతూఉండేది, వీరికి. ఆ పక్కవీధులో వాళ్ల పెళ్లి వీళ్ల పాలింటికి ముప్పైంది. వచ్చిన పెళ్లివారిలో ఈవిడ పుట్టింటివారిని ఎరుగున్నామె ఒకర్తె ఉంది. చిట్టెమ్మని చూడగానే ఆవిడకు నాలిక దురదపెట్టింది. ఒకళ్లిద్దరితో కొన్ని రహస్యాలు రహస్యంగా మాట్లాడేవరకూ ఆ దురద పోలేదు ఆవిడకి. ఆవిడ రాక చిట్టెమ్మ జాతకంలో శని ప్రవేశం అయింది. అమ్మలక్కలకి ఎండవేళ కాలక్షేపానికి బోలెడంత సామగ్రి దొరికింది. ‘చిట్టెమ్మ విధవపెళ్లి ఆడిన ఆవిడకూతురు! వీళ్ల పెద్దక్కయ్య మొగుడిది అదేదో మతం. బ్రహ్మసమాజంలాంటిది. వీళ్ల చెల్లెలికి పద్ధెనిమిదేళ్లు వచ్చాయి! ఎవడూ పెళ్లాడ్డం లేదు! గతిలేనట్టు మాలదొరసాన్ల ఇస్కూల్లో చదువుతోంది!’ నాలుగు ఆడమొహాలు సమావేశపడిన చోటునల్లా ఈ విచిత్ర ఇతిహాసంమీద యాక్షన్లతోకూడా చర్చ జరుగుతూఉండేది. ‘హాశి దీనమ్మ కడుపు కాల! విధవముండ కూతుర్నన్న ఎబ్బెరికమన్నా లేకుండా ఏమొహంపెట్టుకుని సంసారిళ్ల మధ్య కాపరానికి సిద్ధపడిందో?’ ‘ఎప్పుడూ పుస్తకం వోటి పట్టుక్కూచుంటుంది. ఏవిటి చెప్మా! అనుకున్నాను, సంగతిదీ, ఆ మతాలవాళ్ళందరూ అంతేనుట! మగాళ్లు, ఆడాళ్లు ఎప్పుడూ పుస్తకాలలోనే మునిగి తేలతారుట. మనందరితోనూ ఓనాడేనా కూచుని మాట్లాడిన పాపాన్ని పోయిందా? పోనీ అని నేనే ముందు పలకరించాను మొన్న. నంగి నంగిగా మూడుమాటలాడి ఇంట్లోకి చక్కాపోయింది. ఎందుకా! అనుకున్నాను. ఈ కళ్ళంతా బయటపడుతుందని కామోసూ.’ ‘ఆ చెల్లెలుకి పెళ్లెందుకూ? ఆనక పంతులమ్మై ఏ కుశినీవాణ్ణో కట్టుగుంటుంది’ ఇవీ మాటలు.

ఆ పొరుగుపెళ్ళి ఒక్క చిట్టెమ్మ ప్రాణానికేకాదు, నా ప్రాణానికికూడా వచ్చిందంటే నమ్ము.

చిట్టెమ్మదగ్గర రోజూ నేను మధ్యాహ్నం, ఏవో కుట్లూ, అవీ నేర్చుకునేదాన్ని. ఇప్పుడు నాకు వచ్చిన ఇంగ్లీషు కాస్తా ఆవిడ చెప్పినదే. ఈ దెబ్బతో నా చదువు 'బం'దైంది. 'పెళ్లీడొచ్చిన పిల్ల ఆ బ్రహ్మ సమాజందానితో సావాసం చేస్తోందంటే ఎవడూ మీ గడప తొక్కడు. పిల్లకి పెళ్ళికావడంకూడా కష్టం, ఆనక మీ ఇష్టం, మీకోసమే చెబుతున్నాం, మాకెందుకు?' అన్నారు, అమ్మలక్కలు అమ్మతో.

'వెర్రివాడి పెళ్లాం వాడవారందరికీ వదినేట!' నిన్నటిదాకా ఈ చిట్టెమ్మ తిందో పడుకుందో తెలియనివారందరికీ ఇప్పుడు ఆవిడని కనిపెట్టడం ముందుపనై కూచుంది. 'ఓ చీరోటి ఆరేశి కట్టుకుంటే సరి. ఎన్ని పెంటలు తొక్కినా అది మడేను. పట్టుపంచ కొనుక్కోకపోతే పోయిరి, నారపంచేనా కొనుక్కునే దవదేం?' అంటుంది, ఓ 'త్రిపాది'. 'మొగుడింటికొచ్చాడనగానే తుర్రున లోపలికి పరుగెత్తి తలుపేసుగుంటుంది. ఓ యబ్బా! ఇంకా గడించే మొగుడైతే కిందూ మీదూ కానకే పోనేమో!' అంటుంది, ఓ పుట్టు సన్యాసి. నేను మొన్న చూశానమ్మా! పోపులోనే 'ఇంతంటె ఇంత' మినప్పప్పు వేస్త. బాగా సంసారం పొదుపుచేసి 'కంటె' చేయించుకుందాం అనుకుంటోంది కాబోలు!' అంటుంది, ఓ నడమంతరపు సిరిమంతురాలు. 'సోమవారం ఉపోషం కూడాను దీని బతుక్కి! సిగ్గు చిమడ!' అనే ఆచారమంతురాలు ఒకామె. ఇలా ఎన్నని చెప్పను?

చిట్టెమ్మ కష్టాలు ఇంతతో తీరలేదు. రోజు తక్కువైనప్పుడు 'తాడే తాచుపామై' కరుస్తుందిట. చిట్టెమ్మ కాపురం ఉన్న ఇంటివారికి ఒక కొడుకున్నాడు. పదిహేనేళ్లుంటాయి ఆ పిల్లవాడికి. పిఫ్త్‌ఫారం చదువుతూ ఉండేవాడు. బాగా తేపగా పెరిగి కొంచెం అందంగా ఉండేవాడు. ఈవిడ ఆ పిల్లవాణ్ణి అపేక్షగా చూడడం, మాట్లాడ్డం, ఏదేనా తినమని పెట్టడం, ఇల్లా ఉండేది. పిల్లవాడు పెరట్లో మసిలేటప్పుడు, మంచిబట్టలేసుగుని స్కూలుకెడుతూంటేనూ, ఎక్కడో ధ్యాన్నిస్తూ చూసేది అతడివేపు. ఆ అబ్బాయికూడా ఈవిడని 'చిట్టెమ్మగారూ?' అని నోటినిండా పిలిచి గౌరవంగా మాట్లాడేవాడు. లోకాచారం అనే భూతద్దంతో మర్యాదలని జాగ్రత్తగా పరిశీలిస్తూ కుటుంబాలు కూలిపోకుండా రక్షించడపు భారం మీద వేసుగున్న అమ్మలక్కలు దీన్ని ఎంతమాత్రం సహించలేకపోయారు. ఇదంతా ఏదో పెనుముప్పుకి మూలంలా కనిపించింది వారికి. 'వేషాలనీ, తల్లిపోలికనీ, మంచిమాట్లాడి చెల్లెలిని అంటకట్టాలని చూస్తోందనీ, మతాల వాళ్ళకి ఓ మొగుడే ఉండాలన్నమాట లేదుట, ప్రేమలుట! అవేవో, వీళ్ళ విధం'అనీ అసహ్యమైనమాటలు చెప్పుగునేవారు. ఒకప్పుడు చిట్టెమ్మ నాతో, 'అమ్మ చచ్చిపోతే నాలుగునెలల తమ్ముణ్ణి ప్రాణంలా పెంచాను. చంద్రుడులా ఉండేవాడు. బతికుంటే పదిహేనేళ్లు ఇప్పుడు' అని కళ్ళనీళ్లు పెట్టుకోడం, ఇప్పుడు జ్ఞాపకంవస్తోంది నాకు. అప్పుడు నేను చిన్నదానిని.

తగిలినవేలుకే తగులుతుందిట. చిట్టెమ్మ పెనిమిటి మాస్టరీ చేసే స్కూలు ఎలిమెంటరీ స్కూలని చెప్పానుకాదూ? ఆ స్కూల్లో చదువుకునేవాళ్లలో, పందులాళ్ల పిల్లలూ, పాములాళ్ల పిల్లలూ, పాకీవాళ్ల పిల్లలూ హెచ్చుట! ఆపకంపెనీలో చిట్టెమ్మమీద అలజడి ప్రారంభమైనాక సి. ఐ. డి. ముసలమ్మలు ఈ సంగతి రాబట్టడానికి అట్టే రోజులు పట్టలేదు.

మా వీధులో ముసలమ్మ ఒకావిడ వుండేది. ఇలాంటి 'కూపీ'లు తీయడంలో ఆవిడ మొదలిస్టు. షష్టి ఘడియలూ ఎవరో ఒకరితో 'మాట, ఇదిగో విన్నావూ? కూచో, మరే, ఆ సూరాభట్లారు-ఇల్లు కొనుక్కున్నారే-నాలుగొందలు అప్పు తెచ్చారట!-కంటెమ్మేశారుట కూడ! మనకెందుకులే? మళ్లీ ఎక్కడా అనకేం, తిడతారు! మనకెందుకు? ఆ మనిషికేం, అవి కట్టుపళ్లునుమా! నే నన్నానని అనకు. ఆ పిల్ల చెయ్యల్లా విసురుకుంటుందెందుకు? నడుస్తూ? సూరమ్మ మొహాన్ని కళేలేదు. ఎక్కడ రాశాడో గాని దేముడు!' అంటూ, కబుర్లు విడేయకపోతే అన్నం అరిగేది కాదు ఆవిడకి. చిట్టెమ్మ పెనిమిటి సూక్ష్మాలు సంగతి, అంగలేసుగుంటూ వచ్చి కూచుంది, ముసలమ్మ దగ్గర.

ఈలాంటి మాటలువింటూ ఇంటావిడ ఎన్నాళ్లు ఊరుకోగలదు? ఆవిడా ఆడదే. 'రేపు పిల్లాడికి సంబంధంవస్తే? ఈ మాటలు వాళ్లచెవినిపడితే, వాళ్లు పిల్లనిస్తారా?! దిక్కుమాలిన అద్దె పోతేపోయింది. ఆ మాలగుడ్డలు ఇంటినిండా కలుపుతోంది కాబోలు. కుర్రవెధవ, దానితో మాట్లాడొద్దంటే వినడు. రేపు వియ్యాలారు పిల్లనికూడా పంపరేమో, పండక్కి' అనుకుంది. ఇల్లు ఖాళీచేయమంది.

ఎంత వెతికినా ఆ దంపతులకు ఇల్లు దొరకలేదు. 'వెధవముండ కూతురు! ఎల్లా ఇవ్వం?' అన్న మీమాంస గొంతుకు బట్టుకుంది. ఆఖరుకి దూరంగా ఏదో పేటలోకి వెళ్లిపోయారు వాళ్లు. నే నత్తారింటికి వెళ్లిపోయాను.

నాలుగేళ్ల తరవాత విన్నదిది:-

చిట్టెమ్మా మొగుడూ ఊరందరికీ బాకీలు పడ్డారు. ఇంటివాళ్లకు బోలెడద్దె బాకీ. ఎక్కడా అప్పు పుట్టడంలేదు. తిండికిలేక అభోజనాలు పడుకుంటున్నారు. పనికూడా పోయింది.

మరి రెండేళ్ల తరువాత...మావూరు వెళ్లినప్పుడు విన్నది:—

'చిట్టెమ్మ మొగుడు పక్షవాతంవచ్చి పోయాడు. పుట్టింటివాళ్లు 'అజ' లేరు. పిల్లవాడు అల్లరి వెధవై ఊరంబడి తిరుగుతూ ఉండేవాడు. సినీమాబండ్లవెనకాలే వాడిఉనికి. ప్రతీ బండివెనకా వాడేను. బండీవెనక పోతూంటే ఎంతదూరం పోయినదీ వాడికి తెలియదు. అల్లా పోయి పోయి ఒకనాడు ఎటు పోయాడో మళ్లీ కనిపించలేదు. దుఃఖం భరించలేక చిట్టెమ్మ ఏట్లోపడి చచ్చిపోయింది'. పైన మాట రాలేదు నాకు.

కమల కళ్లు తుడుచుకుంటూ 'సంఘద్వేషానికీ, లోకాచారానికీ, బలి ఐపోయి, కాలపరిస్థితులవల్ల జీవచ్ఛవాలుగానూ, మృత జీవులుగానూ, చేయబడ్డ ఈలాంటి పిచ్చివాళ్లు భారతదేశంనిండా ఎందరున్నారో కదా!' అనిమాత్రం అనగలిగింది. అవును. ఎందరున్నారో?!